క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులతో రేపు సమావేశం

గూడెంకొత్తవీధి: రింతాడ సచివాలయంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులతో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాడేరు నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకట రమణ హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆయన కోరారు.

11న గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు

జి.మాడుగుల: మండలంలోని గృహ సారథులు, కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో ఉరుము గ్రామంలో సర్పంచ్ కిముడు రాంబాబు స్వగృహం వద్ద ఈ నెల 11న సమావేశం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పీసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కళ్యాణ్ తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు సమావేశం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు హాజరుకావాలని వారు కోరారు.

నేడు అనంతగిరిలో..

అనంతగిరి: మండలంలోని 23 పంచాయతీల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు అసెంబ్లీ పరిశీలకులు కె.కొండలరావులు హాజరవుతారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు చేపట్టాల్సిన కార్యచరణపై నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పలు సూచనలందిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

రాజవొమ్మంగి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బాపన్నదొర మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రక్తదానం చేసే ఆసక్తి గల వారు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలన్నారు. రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ సంస్థ ప్రతిష్టాత్మక సర్టిఫికెట్లను అందజేస్తుందన్నారు. సంబంధిత సచివాలయ కార్యదర్శులు రక్తదాతల వివరాలను నమోదు చేసి కార్యాలయానికి అందజేయాలని ఎంపీడీవో బాపన్నదొర ఆదేశించారు.


హెల్త్ అసిస్టెంట్ మృతికి సంతాపం



గోపాలరావు(ఫైల్)

పెదబయలు: పెదబయలు పీహెచ్‌సీ కిముడుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న పారామెడికల్ హెల్త్ అసిస్టెంట్ కోడ గోపాలరావు(33) గుండెపోటుతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. సోమవారం రాత్రి నిద్రిస్తుండగా గుండెనొప్పి వచ్చిన కొద్దిసేపటికి ఆయన మృతి చెందినట్టు కుటుంబసభ్యులు చెప్పారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గోపాలరావు మృతికి సహచర సిబ్బంది, గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య సంఘం నాయకులు నాగరాజు, లక్ష్మణరావు, గోవింద్, వీరన్నపడాల్ తదితరులు సంతాపం తెలిపారు.

కనులపండువగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవ మూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట: కొండపాలెంలో గౌరీమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కమ్యూనిటీ హాలు వద్ద భక్తుల దర్శనార్థం పల్లకిలో ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తులకు మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఇందులో భాగంగా చిడతలు, కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 9966329167, 9912440601

మన ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం



గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సింహాద్రిపాలెంలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- చింతపల్లి, అరకులోయ, వై.రామవరం ప్రాంతాల్లో 'గడప గడపకు' విశేష స్పందన
- గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి

చింతపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తమ్మంగుల పంచాయతీ పరిధిలోని తమ్మంగుల, పోసాలపాలెం, కిలిమిసింగి, దానుడువీధి, లంబూరు. దోనిపాలం, లక్ష్మీపురం, పుల్లనిమామిడి, గసాయిగొంది, పెదగొంది గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 380 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని ప్రతి పక్షాలు, పచ్చ మీడియా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఎవరు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, నాడు- నేడు, సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్లు వంటివి దేశానికే ఆదర్శంగా నిలుస్తాయన్నారు. లోకేష్ పాదయాత్ర వల్ల ఎవరికీ ఒరిగేది లేదన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ టీడీపీకి మేలు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం ఉండదన్నారు.

ఎంపీపీ కోరాబు అనూషా దేవి, సర్పంచ్ లక్ష్మయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు బాబూరావు, మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన జగనన్నతోనే సాధ్యం

అరకులోయ రూరల్: ప్రజల చెంతకే పాలన జగనన్నతోనే సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సిర్గం పంచాయతీ సందివలస, నడిమివలస, సిర్గం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 130 గడపలను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సందర్శించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్న పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ కాంతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు జానకి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాసిన్, నాయకులు రఘునాథ్, సాంబ, సుంద్ర, చిరంజీవి, గురుమూర్తి, రామారావు, నర్సింగ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం

వై.రామవరం: సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని యర్రంరెడ్డిపాలెం సచివాలయం పరిధిలోని సింహాద్రిపాలెం, గండెంపల్లి, బొడ్డపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 320 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశారన్నారు. గ్రామాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు , జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, , వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో ప్రకాశ్‌బాబు, నాయకులు త్రిమూర్తులు, అప్పారావు, భారతిబాబు, బాబి, విజయ్‌కుమార్, కనకరాజు, నూకరాజు, తిరుపతిరెడ్డి, బాబూరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో లోహిత్ జయసాగర్

జి.మాడుగుల: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్‌జీవన్ మిషన్ కార్యక్రమం అమలుకు గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య కమిటీ లు ముఖ్య భూమిక పోషించాలని జేజేఎం జిల్లా కో-ఆర్డినేటర్ పి.పుల్లయ్య,ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు.మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డీపీఎంయు టీమ్ ఆధ్వర్యంలో వీడబ్ల్యూఎస్‌సీ కమిటీ సమావేశం జరిగింది. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బందితో 17గ్రామ పంచాయతీల గ్రామ సర్పంచ్‌లు,కార్యదర్శులకు బ్యాంక్ అకౌంట్లు చేశారు. వారు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాలను కమిటీ సభ్యులు బాధ్యతతో నిర్వహించాలని, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహణకు ఇప్పటికే అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉన్న ఫీల్డు టెస్టింగ్ కిట్‌ల ద్వారా శిక్షణ పొందిన వారితో ప్రజలకు అవగాహన కల్పించాలని వారు సూచించారు. వీడబ్ల్యూఎస్‌సీ కమిటీ యొక్క విధులు, బాధ్యతలు, సంఘం సహకారం, నివియోగదారుల చార్జీలు, జమ ఖర్చులు,రికార్డులు నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు, ఆపరేషన్, నిర్వహణ, నీటి నాణ్యత పరీక్ష గూర్చి వారు వివరించారు. జెజేఎం ఐఈసీ కో-ఆర్డినేటర్ నరేష్, ఆర్‌డబ్ల్యుఎస్ విజయకుమార్, యూబీఐ మేనేజర్, పాడేరు సాధన ఐఎస్‌ఏ సిబ్బంది మాణిక్యం, శ్రీను,రామూర్తి, సర్పంచ్‌లు, కార్యదర్శిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, యూబీఐ బ్యాంకు సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కొయ్యూరు ఎంఈవో బోడంనాయుడు



బాలికల విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న గంగవరం ఎంఈవో మల్లేశ్వరరావు

కొయ్యూరు: మండలంలో అత్యంత మారుమూల ప్రాంతమైన ఎం.భీమవరం పాఠశాలను ఎంఈవో బోడంనాయుడు మంగళవారం సందర్శించారు. వై రామవరం మీదుగా ఆయన ఎం.భీమవరం వెళ్లారు. రహదారి సరిగా లేకపోయినా ఆయన బైక్‌పై గ్రామానికి చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి, బోధన, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, అందుకు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

గంగవరం: స్థానిక గిరిజన ఆశ్రమ సంక్షేమ బాలికోన్నత పాఠశాలను ఎంఈవో వై.మల్లేశ్వరరావు మంగళవారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులు, విద్యా ప్రగతిని ఆయన సమీక్షించారు. పదో తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతీ రోజు ఫేషియల్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు. విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. హెచ్‌ఎం ఝాన్సీహేస్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ



అప్పన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పీఎంసీ డైరెక్టర్ అప్పన్నను మంగళవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. అప్పన్నకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. ఎప్పుడు ఎటువంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంపీపీ అనూషా దేవి, సర్పంచ్ దురియా పుష్పలత తదితరులున్నారు.

నూరుశాతం హాజరుపై ప్రత్యేక శ్రద్ధ

- ఏటీడబ్ల్యూవో వెంకటరమణ



మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో వెంకటరమణ

పెదబయలు: పాఠశాలల్లో విద్యార్థులు డ్రాపౌట్స్ కాకుండా చూడాలని, నూరు శాతం హాజరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ అన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు విద్యాశాఖ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫేషియల్ రికగ్నిషన్ హాజరును ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. పాఠశాల రికార్డుల నిర్వహణ మెరుగుపర్చుకోవాలని, హాస్టల్ రిజిష్టర్‌తో పాటు ప్రతీ రోజు స్టాక్ అప్‌డేట్‌గా రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల డ్రాపౌట్స్‌ను తగ్గించాలని విద్యార్థులు సెలవుల్లో మినహా ఇతర సమయాల్లో ఇళ్లకు వెళ్లకుండా నూరుశాతం విద్యార్థుల హాజరు ఉండేలా కృషి చేయాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి తీసుకోవాలన్నారు. పాఠశాల, వసతి గృహాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా పరిశీలించాలని సూచించారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హెచ్‌డబ్ల్యూలు, వార్డెన్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనచోదకులకు సూచనలిస్తున్న సీఐ సత్యనారాయణ, చిత్రంలో ఎస్‌ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలో సొలభం-జి.మాడుగుల రోడ్డు మార్గంలో వాహనచోదకులకు మంగళవారం కౌన్సిలింగ్ కార్యక్రమం వారు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాహనచోదకులు వాహన రికార్డులు, లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని వారు తెలిపారు. జీపు, ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించాలని ఆదేశించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వారు కోరారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న యువత

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామ సచివాలయం పరిధిలోని కోకితగొంది గ్రామ వలంటీర్ ఆర్.వి.వి.సత్యనారాయణరెడ్డికి చెందిన పూరిల్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. సంఘటనలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి చామగడ్డ పంచాయతీ కణతలబంద గ్రామ యువత నిత్యావసర సరకులు, వంట సామగ్రి, నగదు అందజేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ క్రీడా మంత్రిత్వ శాఖ, విశాఖకు చెందిన నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను కాలేజీ ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతోందని, విద్యతో పాటు ఆటల్లో విద్యార్థులు శ్రద్ధ చూపించాలన్నారు. విద్యార్థులకు కబడ్డీ, రన్నింగ్, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగరాజు

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డ గ్రామంలో ఈ నెల 12న నిర్వహించనున్న సీతమ్మతల్లి జెండా కొండ ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు కొర్ర నాగరాజు, స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యాతో పాటు క్రీడా రంగంలో ఆశక్తి పెంచుకోవాలని చెప్పారు. ప్రతిభ క్రీడాకారులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. మాజీ సర్పంచ్ కామేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ దేవరాజు, సీతమ్మతల్లి జెండాకొండ సంక్షేమ సంఘం నాయకులు జానకిరావు, సాధు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


అసంపూర్తిగా ఆలయాలు: భక్తులకు ఇక్కట్లు



మొల్లిమెట్ల గ్రామంలో అసంపూర్తిగా అమ్మవారి ఆలయం

రాజవొమ్మంగి: మండలంలో పలు గ్రామాల్లో ఆలయ నిర్మాణ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో భక్తులు సమీప ప్రాంతాల్లోని దేవాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. మండలంలో మొల్లిమెట్ల గ్రామంలో గతంలో సమరసతా సేవా ఫౌండేషన్ ద్వారా మంజూరైన గుడి నేటికి అసంపూర్తిగా మిగిలింది. అప్పలరాజుపేట, బోయపాడు తదితర మరో ఐదు గ్రామాలు దేవాలయాలు లేక బోసిపోతున్నాయి.అయితే సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెలగలపాలెంలో గాయత్రి దేవి ఆలయం, రేవటిపాలెంలో గంగాదేవికి, మద్దిబంధలలో రామాలయం, గుడి నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆయా ఆలయాల్లో పూజలు జరుగుతున్నాయి. ఇటీవల మండలానికి మరో మూడు దేవాలయాలను సమరసతా సేవా ఫౌండేషన్ మంజూరు చేయగా అవి నిర్మాణ దశలో ఉన్నాయి.

సుధాకర్ గెలుపునకు కృషి చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు అందరూ కృషి చేయాలని సర్పంచ్‌లు రామ్మూర్తి, హరి, అర్జున్, లచ్చన్న, అప్పలరాజు చెప్పారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ ప్రచార పోస్టర్‌ను వారు మంగళవారం ఆవిష్కరించారు. నాయకులు కొములునాయుడు, అశోక్ ,పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



ఆర్‌వీ నగర్‌లో వైద్య సిబ్బంది ర్యాలీ

గంగవరం : కుష్టు వ్యాధి నివారణా ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భావన ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కుష్టువ్యాధిపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు.

గూడెంకొత్తవీధి: కుష్టు వ్యాధిపై గిరిజనులకు అవగాహన అవసరమని ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి మహేష్ అన్నారు. గ్రామంలో మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపించడానికి 3 నుంచి 5 ఏళ్లు పట్టవచ్చని, కొందరికి 20 ఏళ్ల తరువాత కూడా లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధి పట్ల గిరిజనులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రామ దేవతల పండగలు



అమ్మవారి ఘటాలతో భక్తులు

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో గ్రామ దేవతల పండగలను ఘనంగా నిర్వహించా రు. దిబ్బిడి, పెదమదీన, గున్నెంపూడి, గొర్లెపాలెం, కరక, గౌన్నవానిపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం గ్రామదేవతలు పరదేశమ్మ, పైడితల్లమ్మ, తాలమ్మ తదితర గ్రామ దేవతల పండగలు జరిగాయి. కుటుంబ సభ్యులతో గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పలు గ్రామాల్లో గ్రామదేవతలను దర్శించుకున్నారు. దిబ్బిడిలో ఎడ్లబళ్ల పరుగు పందెం, వాలీబాల్ పోటీలతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ముగ్గులు, కబడ్డీ, క్రికెట్, కుర్చీ ఆటలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు గ్రామ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులను ప్రదానం చేశారు.

రావికమతం: మట్టవానిపాలెంలో పరదేశమ్మతల్లి, గొంప గ్రామంలో పైడితల్లతల్లి, మర్రివలస లో నూకాలమ్మతల్లి పండగలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఘటాల ఊరేగింపు భారీగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు, మహిళలు బారులు తీరారు. ఈ సందర్భంగా విద్యుదీపాలంకరణతో పాటు భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

పెన్షనర్లకు సూచనలు

రాజవొమ్మంగి: విశ్రాంత ఉద్యోగులంతా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని రాజవొమ్మంగి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.కృష్ణవర్మ సూచించారు. సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు వెంట తీసుకొని అడ్డతీగల ఉప ఖజానా కార్యాలయానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. భద్రత కోసం తప్పని సరిగా ఈ-కేవీసీ చేయించుకోవాలని ఉపఖజానా అధికారి చంద్రశేఖర్ కోరారు.

మర్రిపాలెంలో రేపు 'గడప గడపకు'

గంగవరం : మండలం మర్రిపాలెం సచివాలయం పరిదిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.శ్రీనివాసులు తెలిపారు. కొమర వరం గ్రామం నుంచి ఆ రోజు మధ్యాహ్నం 2 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఎంపీడీవో తెలిపారు. మండల స్థాయి అధికారులు., గ్రామ సచివాలయ సిబ్బంది విధిగా పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

11న పవనగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో ఈనెల 11న కుజగ్రహ దోష నివారణ తదితర పూజలు నిర్వహిస్తున్నట్టు పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.ఆ రోజు ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు జరుపుతామన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట రేపు

రాజవొమ్మంగి: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఉదయం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. పూజా కార్యక్రమాల అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు తరలి రావాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
✆ 9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com